Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143




ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 102 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | శనివారం 11 ఏప్రిల్ 2026 | పేజీలు : 4 | వెల : 3

## గృహ గణనలో ఇప్పటికే 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్




- స్మార్ట్‌గా, సౌకర్యవంతంగా లక్షలాది కుటుంబాల స్వీయ గణన
- జనగణన డిజిటల్ సదుపాయాల్లో పెరుగుతున్న ప్రజా భాగస్వామం
- 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్ : ఆర్‌జీఐ
- ప్రత్యేక మొబైల్ యాప్ - ప్రతీ కుటుంబానికి 33 ప్రశ్నలు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ వేర్వేరు తేదీల్లో జరగనుంది
- ఆంధ్రప్రదేశ్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు ఉంటుంది.



## ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు

- నియోజకవర్గాల పునర్విభజనతో పెను ముప్పు: ఖర్గే
- మహిళా రిజర్వేషన్ల అమలులో కుట్ర
- నియోజక వర్గాల పునర్విభజనపై విపక్షాల ఉమ్మడి పోరుకు ఖర్గే పిలుపు

## వచ్చే 6 నెలల్లో.. 10 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని ఆదేశం
- పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచన
- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

యుద్ధాల కారణంగా తలెత్తిన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు, ఆయిల్ కంపెనీలకు సూచించారు. దీపం పథకం లబ్ధిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. దీపం పథకం లబ్ధిదారులు పీఎన్జీకి మారితే, వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, దీనిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని ఆదేశించారు. - మిగతా3లో

## పెద్ద కుటుంబాలకు ప్రోత్సాహం

- త్వరలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ బిల్లు
- ఏపీలో పెద్ద కుటుంబాలకు ప్రాధాన్యం
- సంస్కరణల అమలుకు నిర్ణయించిన ప్రభుత్వం
- ఐటీ, విద్యాశాఖ మంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ ప్రయోజనాలను అందించడంతో పాటు పెద్ద కుటుంబాలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యంగా సంస్కరణలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి త్వరలో - మిగతా3లో






## పాకిస్థాన్ గూఢచార మాడ్యూల్ గుట్టురట్టు చేసిన ఢిల్లీ పోలీసులు

- 'సీసీటీవీ'లతో సైనికుల కదలికలపై నిఘా పెట్టిన ఉగ్రముఠా
- పాకిస్థాన్ హ్యాండర్లతో ఉగ్రముఠాకు సంబంధాలు
- 11 మంది అరెస్టు- సాంకేతికతను ఉపయోగించి సైనిక కదలికలపై నిఘా

## మహిళలకు, నిరుద్యోగులకు రూ.3000 ఆర్థిక సాయం

- చొరబాట్లపై ఉక్కుపాదం
- బంగాల్ బీజేపీ మేనిఫెస్టో ఇదే!
- సోనార్ బంగ్లా రోడ్ మ్యాప్
- బంగాల్ ఎన్నికల కోసం 15 అంశాలతో బీజేపీ మేనిఫెస్టో విడుదల



## క్రిమినల్‌తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి

- మంత్రులకు సీఎం దిశానిర్దేశం
- కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరం
- ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రచారం చేసే కుట్రలను నిత్యం తిప్పికొట్టాలి
- కేబినెట్ అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో చర్చించిన సీఎం చంద్రబాబు
- బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరమని సీఎం చంద్రబాబు అన్నారు. నేరగాళ్లతో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు ముగిశాక ఇతర అంశాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం దాదాపు 3గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. కేబినెట్ అజెండా అంశాలు ముగిశాక మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు అంశాలపై చర్చించారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ - మిగతా3లో






## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన నీతీశ్ కుమార్

- నీతీశ్ చేత ప్రమాణస్వీకారం చేపించిన రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్
- హిందీలో ప్రమాణం చేసిన నీతీశ్ కుమార్
- కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్

## ఇంధన భద్రతపై గల్ఫ్ దేశాలతో చర్చలు

- పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం
- దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారు
- భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్

## డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యంగా దండి యాత్ర 2.0



- తిరుపతి నుంచి విశాఖకు 1000 కి.మీల భారీ సైకిల్ ర్యాలీ
- యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు మహా సంకల్పం
- తిరుపతి నుంచి విశాఖపట్నం దాకా వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం
- లక్ష మంది విద్యార్థులతో సే నో టు డ్రగ్స్ ప్రతిజ్ఞ

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య డ్రగ్స్ (మాదకద్రవ్యాలు). యువత ఉజ్వల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న ఈ మత్తు మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా నడుం బిగించాయి. మత్తు రహిత రాష్ట్రమే (డ్రగ్ ఫ్రీ ఏపీ) లక్ష్యంగా ఒక మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టాయి. ఉప్పుపై పన్నును నిరసిస్తూ నాడు జాతిపిత మహాత్మా గాంధీ చేపట్టిన చారిత్రక - మిగతా3లో

## కుప్పం నియోజకవర్గంలో
## తెలుగుదేశం పార్టీ ఉత్తమ ప్రతిభలకు సన్మానం



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్10:**
తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుప్పం నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మందిని పార్టీ కేంద్ర కార్యాలయం గుర్తించింది. ఇందులో భాగంగా శాంతీపురం మండలం నుండి మండలం పార్టీ అధ్యక్షులు నందిగం ఉదయ్ కుమార్, శాంతీపురం క్లస్టర్ ఒకటి ఇంచార్జి రాజేంద్ర ప్రసాద్, రాళ్ళబూ దుగూరు యూనిట్ ఇంచార్జ్ ఆర్ ఎస్ మణిలను ఎంపిక కాబడిన సందర్భంగా శుక్రవారం కుప్పం పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పి కే యం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, నియోజకవర్గ, మండలముఖ్య నాయకులు వీరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచ ర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, పార్టీకి అంకితభావంతో పనిచేసే ప్రతికార్యకర్తకు గుర్తింపు ఇచ్చేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయకులలో మండల పార్టీ అధ్యక్షుడు ఎన్. ఉదయ్‌కుమార్ మాట్లాడు తూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా పని చేయడం గర్వంగా భావిస్తున్నాము అని నాయకులు కార్యకర్తలు అందరి ఆశీస్సులు సహకారంతోనే ఈ గౌరవం పొందాము ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణ పాఠశాలలో
## విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షన్ లపై అవగాహన కార్యక్రమం




**సూళ్లూరుపేట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
సూళ్లూరుపేట ఏప్రిల్ 2025 26 స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట పురపాలక సంఘ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు చెత్త వేరు చేసే విధానం, తడి పొడి హానికర చెత్త గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కే దేవేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## పూల తోటలో ఉచిత పశు వైద్య శిబిరం




**దొరవారిసత్రం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
దొరవారిసత్రం మండలంలోని పూల తోట గ్రామంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం ద్వారా 25 వేల రూపాయలు విలువ కలిగిన మందులను పశువులకు వైద్యం కోసం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పశువులకు సంరక్షణ కల్పించడానికి ఈ ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంక్షేమ శాఖ ఏడి ధనంజయ, వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ రామమ్మ, దొరవారిసత్రం మండలం టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు, ఏఎంసీ డైరెక్టర్లు ఉదయ్ కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీఎన్ రాధాకృష్ణను వెంటనే అరెస్టు చేయాలి
### వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకుల డిమాండ్
### రాధాకృష్ణ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని ఫిర్యాదు



**సూళ్లూరుపేట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 10:**
ఏబీఎన్ రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సూళ్లూరుపేటలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ అజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అల్లూరు అనిల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏబీఎన్ రాధాకృష్ణ సభ్యత, సంస్కారం లేని విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ స్థాపించినప్పటి నుంచి ఆయనపై నిరంతరం అవాస్తవాలు ప్రచారం చేస్తూ విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. జర్నలిస్టు ముసుగులో ఉండి నారా చంద్రబాబు నాయుడుకు రక్షణగా వ్యవహరిస్తూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని కాపాడుకునే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అదే సమయంలో తన వ్యక్తిగత ఆర్థిక లాభాలను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఏబీఎన్ రాధాకృష్ణను వెంటనే అరెస్టు చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సూళ్లూరు పేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కృపాకర్ రెడ్డి, జెట్టి వేణు, అయితే శ్రీధర్, చిలకా యుగంధర్, మీజురు రామకృష్ణారెడ్డి, తుపాకుల ప్రసాద్, బందిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు మన జెండా కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
శ్రీకాళహస్తిలోని విఎంసి హాల్ సర్కిల్ వద్ద మనఊరు మన జెండా కార్యక్రమం విజయవం తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ పాల్గొన్నారు.అనంతరం బిజెపి జెండాను ఆవిష్కరించి,స్వీట్స్ పంచిపెట్టారు. పార్టీ బలోపేతానికి సంబంధించిన సూచనలు కార్యకర్తలకు నాయకులకు విసదీకరణంగా తెలియజేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పర్యటనకు బ్రహ్మారథం పట్టిన మహిళలు
### ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీ నుండి టిడిపిలో చేరికలు.. ఎమ్మెల్యే చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
వీకోట మండలంలో కొనసాగుతున్న "మన ఊరికి మన ఎమ్మెల్యే" కార్యక్రమం భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే అమర నాథ రెడ్డి పర్యటన అత్యంత ఉత్సాహంగా సాగింది. పర్యటనలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యంగా మహిళలు మంగళహారతులు ఇచ్చి వీరతిలకం దిద్ది తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రజల ముంగిటికే పాలన అందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని చేరవేయడంతో పాటు అన్ని గ్రామాల అభివృద్ధి తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ ఇప్పటివరకు నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. పర్యటన మూడవ రోజు భాగంగా కుంబార్లపల్లి, బైరిపల్లి పంచాయతీలలో పలు



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కుంబార్లపల్లి పంచాయతీ పరిధిలోని అనంతపురం గ్రామంలో 8 లక్షల రూపాయలతో, గెస్తంపల్లి గ్రామంలో 18 లక్షల రూపాయలతో, మరో 6 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. బైరిపల్లి పంచాయతీ పరిధిలో వీకోట నుండి బయలుపల్లి వయా యాదుకుంట పెదరాంపల్లి వరకు 11 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన పీటీ రోడ్డును ప్రారంభించారు. బైరిపల్లిలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును కూడా ప్రారంభించారు. వేసవికాలంలో రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు గెస్తంపల్లి గ్రామంలోని పాపేపల్లి మిట్ట సబ్‌స్టేషన్‌లో అదనపు విద్యుత్ బ్రేకర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీకోట మండలంలోని కుంబార్లపల్లి, బైరిపల్లి పంచాయతీలకు చెందిన వైసీపీకి చెందిన సుమారు 50మంది కార్యకర్తలు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో పలమనేరు బాలాజీ, రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు, ఏఆర్ నాగరాజ్, ధీరజ్, శబరి, జీకే కుమార్,గిరి, నాగరాజ్, రాధాకృష్ణ, సురేష్, రాజా, రమేష్, అక్బర్ చాంద్ బాషా, తిప్పాచారి, సుబ్రహ్మణ్యం, విజయ్, సోము తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామకుప్పం పోలీస్ స్టేషన్‌పై జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆకస్మిక తనిఖీ

**రామకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10**
చిత్తూరు జిల్లా రామకుప్పం పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారి తుషార్ డూడి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు తీరును ఆయన సమీక్షించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీలు, గ్రామ రోస్టర్, వివిధ నేరాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రత్యేకంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్టేషన్ పరిధిలో తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని, రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనం నడపడం, రోడ్డు భద్రతా నియమాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.హత్యలు, హత్యాయత్నాలు, మహిళలపై నేరాలు, కనిపించకుండా పోయిన బాలికల కేసులు, ఆస్తి సంబంధిత నేరాలు, రోడ్డు ప్రమాదాలు వంటి కేసుల వివరాలను పరిశీలించారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించి నిందితులు అరెస్టు కాని కేసుల్లో త్వరగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, హోటళ్లు, లాడ్జిలు వంటి ప్రాంతాల్లో నిఘా పెంచాలని, ప్రజలకు కనిపించేలా పోలీసింగ్ నిర్వహించాలని సూచిం చారు. రాత్రి,పగలు బీట్ల పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల పోలీసులు ఇంటింటికి వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, వివాహసంబంధిత సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. సైబర్ నేరాలు, ముఖ్యంగా అప్పు యాప్‌ల మోసాలు, మంచి స్పర్శ--చెడు స్పర్శ, బాలల రక్షణకు సంబంధించిన నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమాజంలో చైతన్యం పెంచేందుకు రోడ్డు భద్రత,సైబర్ నేరాలపై



ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, మహిళలు, బాలబాలికలకు వారి రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పోలీసు అధికారులు తరచుగా గ్రామాల ను సందర్శించి గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవా లని తెలిపారు. వారు అందించే సమాచా రంపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు, సీజ్ చేసిన వాహనాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో అదనపు జిల్లా పోలీసు అధికారి తరుణ్ పహ్వా, కుప్పం ఉపవిభాగ పోలీసు అధికారి పార్థసారధి, ప్రత్యేక శాఖ ఇన్స్పెక్టర్ మురళీ మోహన్, జిల్లా నేర రికార్డు విభాగం ఇన్స్పెక్టర్ మనోహర్, రామకుప్పం సబ్ ఇన్స్పెక్టర్ వెంకట మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మనఊరికే మన ఎమ్మెల్యేపై పత్రికా సమావేశం నిర్వహించిన
## మాజీ శాసనసభ్యులు వెంకట గౌడ.

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
వి.కోట మండలంలో గత మూడు రోజులుగా పలమనేరు శాసనసభ్యులు ఎన్ అమరనాథరెడ్డి ప్రవేశపెట్టిన మన ఊరికే మన ఎమ్మెల్యే పర్యటనపై ఈరోజు పలమనేరు మాజీ శాసనసభ్యులు ఎన్ వెంకట గౌడ ఎద్దేవా చేసినారు. మీడియా ముందర మాట్లాడుతూ మన ఊరికే మన ఎమ్మెల్యే పేరుతో పర్యటనలు చేస్తానని చెప్పడం ఆశ్చర్యకరమని ఇది కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు గారి మందలింపుల తర్వాతనే మొదలైన చర్య అని మీడియా లలో ప్రచారం జరుగుతోందని అన్నారు. గ్రామాలలో తిరగడంపై ఎవరికి అభ్యంతరం లేదు గాని గత మూడు రోజులుగా జరుగుతున్న పర్యటనలు చూస్తే సాధారణ ప్రజల ఇళ్లకు వెళ్లడం లేదని కేవలం స్థానిక టిడిపి నాయకుల ఇండ్లకు మాత్రమే పరిమితం అవుతున్నారని ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదని చిత్తశుద్ధి లేని పర్యటనలు వలన ప్రజలకు కలిగే ప్రయోజనం ఏంటి అని ప్రశ్నించారు. గడిచిన 22 నెలల నుండి గ్రామాలలో ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లకు లబ్ధిదారులతో కలిసి పోజులు ఇస్తున్నారు. తప్ప కొత్త పెన్షన్లు మంజూరు చేసిన దాఖలాలు లేవని అన్నారు. మా ప్రభుత్వ హయాములో ఒక్క వీకోట మండలానికి పదివేల ప్రభుత్వ గృహాలు మంజూరు చేసినామని, మీ ప్రభుత్వ హయాములో ఈ వీకోట మండలంలో కనీసం ఒక్క మనిషికైనా గృహ నిర్మాణ పట్టా ఇచ్చారా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలను ఎంతవరకు మీరు అమలు చేశారని, ప్రజల ఆర్థిక స్థితిగతులు ఏమైనా మెరుగుపడ్డాయని , వీటి పైన మీకు ఏమైనా అవగాహన ఉన్నాయని ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం వీకోట మండలంలోని కృష్ణాపురం నుండి ఎడగురికి గ్రామం వరకు 53 లక్షల రూపాయల వ్యయంతో 2022 డిసెంబర్ 27వ తేదీన ప్రారంభించిన రోడ్డుకు ఇప్పటికే నిర్మించబడిన పనికే పక్కనే కొత్త శిలాఫలకం ఏర్పాటు చేసి 2018 నిర్మాణం జరిగిందని ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఇప్పటికే పూర్తయిన పనులకే కొత్త శిలాఫలాలు పెట్టి, వాటిపై మాజీ సర్పంచ్ల పేర్లు వేసుకోవడం, కోట్ల రూపాయల అభివృద్ధి చేసినట్లు ప్రచారం చేయడం సిగ్గుచేటు కాదా అని ఇవన్నీ పాత పనులే ,మళ్లీ ఎందుకు ఈ నాటకాలు ప్రారంభోత్సవాలు అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇక మీ కోట ప్రభుత్వ పాఠశాల భూములపై కన్నేసి షాపింగ్ కాంబినేషన్ నిర్మించాలని ప్రయత్నాలు అత్యంత ఆందోళనకరమని దీనిపై హైకోర్టు ద్వారా మేము అడ్డుకొని స్పష్టంగా ఆంక్షలు విధించిన ఇలాంటి



ప్రయత్నాలు కొనసాగడం దురదృష్టకరమని పలమనేరు ప్రజల హక్కులను కాపాడడంలో ఎలాంటి రాజీ ఉండదని కబ్జాలో వేధింపులు ఎదుర్కొంటున్న ప్రతి సామాన్యుడికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని పలమనేరు మాజీ శాసనసభ్యులు ఎన్ వెంకయ్య గౌడ్ అన్నారు. కార్యక్రమంలో బి కోట మండలం ఎంపీపీ కే. యువ రాజు, రాష్ట్ర వైకాపా అధ్యక్షుడు పిఎన్ నాగరాజు మాజీ వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతుల్లో పాల్గొన్న కుప్పం కో క్లస్టర్ ఇంచార్జ్




**విజయవాడ, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 10:**
విజయవాడలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించిన క్లస్టర్, కో క్లస్టర్ ఇంచార్జ్‌ల శిక్షణ తరగతుల్లో కుప్పం కో క్లస్టర్ ఇంచార్జ్ వెడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కుప్పం మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న స్థానికఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటినుంచి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు ఇప్పటినుంచి సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతం, కార్యాచరణ,పార్టీ విధి విధానాల అమలు, కార్యకర్తలకు గుర్తింపు కల్పించడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.

## అకడమిక్ ఆడిట్‌లో
## కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రతిభ ప్రదర్శన




**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 10:**
కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అకడమిక్ ఆడిట్ సందర్భంగా ప్రతి విభాగం తమ ప్రత్యేక ప్రతిభను ప్రతిబింబించే విధంగా ఉత్తమ పద్ధతులను ప్రదర్శించింది. విభాగాల వారీగా రూపొందించిన అవగాహన ఒప్పందాలు, నిర్వహించిన శిక్షణ శిబిరాలు,విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశాలమైన కళాశాల వాతావరణం, కృత్రిమ మేధస్సుతో అనుసంధానించిన డిజిటల్ తరగతి గదులు, సమాచార సాంకేతికత ఆధారిత బోధన విధానాల ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడం వల్ల కళాశాల ఉన్నత స్థాయి అ గ్రేడ్‌ను సాధించింది. ఈ కార్యక్రమంలో అకడమిక్ సలహాదారు డా రుక్మిణి, డా హరిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ బి ప్రదీప్ కుమార్, ఉప ప్రిన్సిపాల్ డా రాజ్యలక్ష్మి, ఎన్ నమ్రత, డా చంద్రబాబు పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధి, నాణ్యమైన విద్యా బోధన, సాంకేతిక వినియోగంలో ముందంజలో ఉందని అకడమిక్ ఆడిట్ ద్వారా వెల్లడైంది.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యంగా 'దండి యాత్ర 2.0'

-మొదటిపేజీ తరువాయి

'దండియాత్ర' మనందరికీ తెలుసు. ఇప్పుడు సరిగ్గా అదే స్ఫూర్తితో డ్రగ్స్ వలయాలను ఛేదించేందుకు 'దండి యాత్ర 2.0' పేరుతో తిరుపతిలో భారీ సైకిల్ ర్యాలీ మొదలైంది. బ్రిటీష్ కాలంలో ఉప్పు చట్టాలను వ్యతిరేకిస్తూ గాంధీజీ శబర్మతి ఆశ్రమం నుంచి దండి వరకు సుమారు 390 కిలోమీటర్ల మేర చారిత్రక పాదయాత్ర చేశారు. నాడు పరాయి పాలన నుంచి విముక్తి కలిగించేందుకు ఆ యాత్ర సాగితే, నేడు మత్తు నుంచి యువతను విముక్తి చేసేందుకు 'దండి యాత్ర 2.0' ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం 'ఈగల్ టీమ్', స్వచ్ఛంద సంస్థ 'వైబ్రెంట్స్ ఆఫ్ కలాం' సంయుక్త ఆధ్వర్యంలో ఈ యాత్రను డిజైన్ చేశారు. ఈ భారీ సైకిల్ యాత్ర తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుంచి ఉత్సాహంగా ప్రారంభమైంది. ఇక్కడి నుంచి విశాఖపట్నం వరకు ఈ యాత్ర కొనసాగుతుంది. మొత్తం 1000 కిలోమీటర్ల మేర ఈ సుదీర్ఘ ప్రయాణం సాగనుంది. సైకిల్ యాత్ర బృందం ప్రతిరోజూ 60 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. "డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా దాదాపు 1000 కిలోమీటర్ల వరకు మేము యాత్ర చేస్తున్నాం. మా వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థకు చెందిన ఏడుగురు సభ్యుల బృందం ఈ సైకిల్ యాత్రలో పాల్గొంటోంది. 13 జిల్లాల మీదుగా 25 యూనివర్సిటీలు, కాలేజీలకు వెళ్తాం. దాదాపు లక్ష మంది యువతను ప్రత్యేకంగా కలుసుకుని, వారితో 'సే నో టు డ్రగ్స్' అనే ప్రతిజ్ఞ చేయిస్తూ యాత్రను ముందుకు నడిపిస్తాం. సీఎం చంద్రబాబుని కలిసి ఆయన మార్గదర్శకత్వంలో ఈ యాత్రకు శ్రీకారం చుట్టాం. దీనికి ఐజీ ఆర్కే రవికృష్ణ పూర్తి సహకారాలు అందిస్తున్నారు. ఈరోజు ఎస్వీ యూనివర్శిటీ నుంచి యాత్ర మొదలైంది." – విజయ్ కల్లాం, ఫౌండర్, వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ



## లక్ష మంది యువతే టార్గెట్

ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం యువత ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడమే. యాత్ర మొత్తం మీద రాష్ట్రంలోని 13 జిల్లాల గుండా ఈ బృందం ప్రయాణిస్తుంది. ఆయా జిల్లాల్లో దారి పొడవునా ఉన్న సుమారు 25 విశ్వవిద్యాలయాలు (యూనివర్సిటీలు), ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలను వీరు సందర్శిస్తారు. దాదాపు ఒక లక్ష మంది యువతను ప్రత్యక్షంగా కలుసుకుని, వారితో మమేకం అవుతారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఎదురయ్యే అనర్థాల గురించి వివరిస్తారు. డ్రగ్స్ ఉపయోగిస్తే జరిగే నష్టాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశం. 'డ్రగ్స్ వద్దు – సైకిల్ ముద్దు' అనే నినాదంతో ఈ దండి యాత్ర 2.0 కొనసాగుతుంది. 13 జిల్లాల్లో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. దీనివల్ల ప్రజలంతా మత్తు పదార్థాల అనర్థాల గురించి తెలుసుకుని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడాలని మేము తెలియజేస్తున్నాం." – తిరుపతి పోలీసులు

## ప్రభుత్వం, పోలీసుల మద్దతు

'డ్రగ్స్ వద్దు సైకిల్ ముద్దు' అనే పవర్‌ఫుల్ నినాదంతో ఈ యాత్ర ముందుకు సాగుతోంది. ఈ బృందానికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఈ యాత్ర రూపుదిద్దుకోగా, పోలీసు ఉన్నతాధికారి ఐజీ ఆర్కే రవికృష్ణ దీనికి పూర్తి సహకారాలు అందిస్తున్నారు.

# పెద్ద కుటుంబాలకు ప్రోత్సాహం

-మొదటిపేజీ తరువాయి

ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్) బిల్లును అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకు సంబంధించి (ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) సిఫార్సు చేసేందుకు ఐటీ, విద్యాశాఖ మంత్రి ఛైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఆర్థిక, హోం, రెవెన్యూ, పౌరసరఫరాలు, వైద్యఆరోగ్య, జలవనరుల శాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు. అదే విధంగా కన్వీనర్?గా ప్రణాళికాశాఖ ముఖ్యకార్యదర్శి విధులను నిర్వర్తిస్తారు.

## కమిటీ చేయవలసిన పనులివే!

ప్రధానంగా ప్రతిపాదిత ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుకు వర్తింపజేసేలా 'కుటుంబం' అనే నిర్వచనాన్ని రూపొందించాలి. ఇది ముఖ్యంగా పెద్ద కుటుంబాలను ప్రోత్సహించే లక్ష్యానికి అత్యంత అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం, అదే విధంగా భవిష్యత్తులో చూపేటటువంటి ఆర్థిక, పరిపాలనా ప్రభావాన్ని సైతం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ధనిక, పేద ఉండేటటువంటి ఆర్థిక అంతరాలను తగ్గించడమే లక్ష్యంగా వివిధ సంక్షేమ పథకాలకు సమగ్ర ఆర్థిక అర్హత ప్రమాణాల్ని పరిశీలించిన తర్వాత సిఫార్సు చేయాలి.

## పథకాల వారీగా ప్రయోజనాలు

చిన్న కుటుంబం (1–3 సభ్యులు) మధ్యస్థ కుటుంబం (4–6 మంది సభ్యులు), పెద్ద కుటుంబం (7–ఆపైన) దృష్టిలో పెట్టుకుని పథకాల వారీగా ప్రయోజనాలకు సంబంధించి సంస్కరణలను సిఫార్సు చేయడం, పెద్ద కుటుంబాలను ప్రోత్సహించే విధంగా, ప్రయోజనాల కోసం విడిపోయే కుటుంబాలను నిరుత్సాహపరిచే విధంగా ఉండాలి. ప్రజాధనాన్ని సమర్థంగా వినియోగించేలా ఉండటంతో పాటుగా సామాజిక భద్రతను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే వివిధ పథకాల ద్వారా పొందే మొత్తం ప్రయోజనాలపై గరిష్ట పరిమితి కోసం ఫ్రేమ్?వర్క్?ను సమీక్షించి సిఫార్సు చేయడం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అదే విధంగా ప్రతిపాదిత ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్?మెంట్ బిల్లు, ఇతర నిబంధనలను సమీక్షించడం, కుటుంబ డేటా బేస్ నిర్వహణకు ప్రత్యేక అథారిటీ నియామకం, డేటాబేస్ అప్?డేట్ తయారీ, వినియోగం, ఏపీలో పథకాలు, అంతేకాకుండా సేవల పంపిణీకి ఫ్యామిలీ కార్డుల జారీ, వినియోగం మొదలైన తదితర అంశాలపై సిఫార్సు చేయాలి.

రాబోయే రోజుల్లో పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేలా ఆలోచనలు చేస్తున్నామని గత నెలలో అమరావతిలో నిర్వహించిన మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ అనేది మనకు భద్రత కల్పిస్తుందని, దాన్ని మరింత బలపరిచే బాధ్యత ప్రభుత్వానిపై ఉన్నదని సీఎం వివరించారు. ప్రస్తుతం జనాభా ఆందోళనకర స్థాయిలో తగ్గిపోతుందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దంపతులు ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలను కనాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరికొందరైతే పిల్లల్ని కనే ఆలోచననే మానుకున్నారని, అయితే అది మంచి విధానం కాదని సీఎం చంద్రబాబు హితవు పలికారు.

# తిరుపతిలో 10 అంతస్తుల్లో బస్ స్టాండ్

**తిరుపతి :** తిరుపతికి శ్రీవారి దర్శనం కోసం నిత్యం భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ మేకు భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నగరంలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్ స్థానంలో ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు రూ.470 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణాన్ని ఈపీసీ విధానంలో నిర్మించాలని అధికారులు నివేదికను పంపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో మౌలిక వసతుల్ని మరింత మెరుగుపరిచేందుకు సిద్ధమైంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తిరుపతికి వస్తుంటారు. ఈ క్రమంలో తిరుపతిలో మరిన్ని మౌలిక వసుతల్ని కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించింది. తిరుపతిలో ప్రస్తుతం ఉన్న మెయిన్ బస్టాండ్ స్థానంలో కొత్తగా ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోగా.. తాజాగా దీనికి సంబంధించి కీలక ముందడుగు వేసింది. తిరుపతి ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌కు ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో నిర్మించాలని తేల్చారు. తిరుపతిలో ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీకి చెందిన బస్టాండ్ స్థలంలో.. ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ (నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్) బస్ టెర్మినల్‌ను రూ.470 కోట్ల అంచనాతో ప్లాన్ చేశారు. ఈ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి మూడు విధానాలను (బీవోటీ, హామ్, ఈపీసీ) అధ్యయనం చేశారు. వాటిలో ఈపీసీ బావుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనల్ని కూడా పంపారు. తిరుపతి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్, తిరుమల, ఆ చుట్టుపక్కల ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఈ టెర్మినల్ కీలకంగా మారింది.. అందుకే దీనికి ఇంటర్ మోడల్‌గా పేరు పెట్టారు. ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ డీపీఆర్ తయారు చేసేందుకు రైట్స్ (రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ లిమిటెడ్)ను సలహా సంస్థగా నియమించారు.ప్రస్తుతం ఉన్న తిరుపతి బస్టాండ్, డిపో కలిపి మొత్తం 13.18 ఎకరాల్లో ఉంది. ఇందులో 7.11 ఎకరాల్లో ఈ బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. రోడ్డు పక్కన ఉన్న 4.29 ఎకరాలను కమర్షియల్‌గా అభివృద్ధి చేయనున్నారు.99 సెంట్ల భూమిని రోడ్డు కోసం, 79 సెంట్ల భూవిని ఫ్లై ఓవర్ కోసం నిర్మించనున్నారు. బస్ టెర్మినల్‌లో పార్కింగ్ కోసం సెల్లార్‌లో రెండు అంతస్తులు ప్లాన్ చేశారు. ఇలా ఆయ సదుపాయాల కోసం భూమిని కేటాయించారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం టెర్మినల్‌కు కేటాయిస్తారు. మొత్తం 98 ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం.. టెర్మినల్ ప్రాంగణంలో మరో 50 బస్సులు నిలిపేందుకు వీలుగా స్థలం కేటాయించనున్నారు.టెర్మినల్ గ్రౌండ్ ఫ్లోర్ పైన 10 అంతస్తులు నిర్మించి కమర్షియల్ (హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలకు, మిగిలిన షాపులకు) కేటాయిస్తారు. అంతేకాదు టెర్మినల్‌లోని పదో ఫ్లోర్‌లో హెలీప్యాడ్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ టెర్మినల్ నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్‌ను కనెక్ట్ చేసేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇటీవల అధికారులు ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నవారితో అధికారులు మాట్లాడారు.. వారి నుంచి అభిప్రాయాలసేకరించి పభుత్వానికి నివేదిక పంపించనున్నారు. కమర్షియల్‌గా కేటాయించబోయే వాటితో లాభాల పరిస్థితి.. ఆర్టీసీకి ఎంత ఇస్తారు, ఒప్పందం ఎన్నేళ్లు అనే అంశాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను మరో చోటికి తరలిస్తే 5 ఎకరాల భూమి, డిపో కోసం మరో ఐదు ఎకరాలు తాత్కాలికంగా కేటాయించాలని ఆర్టీసీ జిల్లా కలెక్టర్‌ను కోరింది.



తిరుమల ఆలయాన్ని ప్రతిబింబించేలా బస్టాండ్ ముఖద్వారం నమూనా

## 'వచ్చే 6 నెలల్లో 10 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలి'

-మొదటిపేజీ తరువాయి

పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ధి పొందవచ్చన్న విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. గ్యాస్ సరఫరా ఇబ్బందులను అధిగమించడానికి ఆయిల్ కంపెనీలు పీఎన్జీ కనెక్షన్లను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. వచ్చే 6 నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని, ఈ విషయంలో జాప్యం ఉండకూడదని, టార్గెట్ ఎట్టిపరిస్థితుల్లో చేరుకోవాలని చెప్పారు.

### కేంద్ర మంత్రికి చంద్రబాబు ఫోన్

గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ సరఫరాలో సమస్యలను అధిగమించామని ఈ సందర్భంగా అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు. డొమెస్టిక్ పంపిణీకి సంబంధించి సమస్యను తగ్గించామని, త్వరలో సాధారణ స్థితికి తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళం – కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్ లైన్ పనుల్లో జాప్యంపై సీఎం అధికారుల వివరణ కోరారు. దీనికి సంబంధించి కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పడంతో సమీక్ష నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి చంద్రబాబు ఫోన్ చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఎల్పీజీ, పీఎన్జీ మధ్య వ్యత్యాసం

ఎల్పీజీ, పీఎన్జీ సిలిండర్ ధర వ్యత్యాసం చూసుకుంటే గ్యాస్ సిలిండర్ ధర ప్రతినెలా సుమారు రూ.1,000 పైనే ఉంటుంది. పీఎన్జీ బిల్లు ధర రెండు నెలలకు దాదాపు 500–600 కంటే ఎక్కువ రాదు. ఈ రెండింటి మధ్య 50 శాతం తేడా ఉంటుంది. యుద్ధ ప్రభావం వల్ల సిలిండర్ దొరక్క చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ బుక్ చేసి వెయిట్ చేయాల్సిన అవసరం లేదని, పైపుల ద్వారానే గ్యాస్ వచ్చేస్తుందని ప్రభుత్వం ఇప్పటికే తెలిపింది. నిరంతరం పైపుల ద్వారానే గ్యాస్ సరఫరా అవుతుందని, మధ్యలో ఆగిపోవడం వంటివి ఉండవు అని వెల్లడించింది. ఎల్?పీజీతో పోల్చుకుంటే పీఎన్జీ కనెక్షన్ అనేది చాలా ప్రయోజనకరమైనదిగా ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా దీపం పథకం లబ్ధిదారులు పీఎన్జీకి మారితే, వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ధి పొందవచ్చన్న విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు తాజాగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## 'క్రిమినల్‌తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి'

-మొదటిపేజీ తరువాయి

పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి 4 కార్యక్రమాల్లోనైనా పాల్గొనాలని సూచించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలి

ఈ సందర్భంగా కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరమన్న సీఎం అన్నారు. క్రిమినల్?తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సీఎం సూచించారు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రచారం చేసే క్రిమినల్ కుట్రలను మంత్రులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ తిప్పికొట్టాలని సూచించారు. ప్రజలకు వాస్తవాలు చెప్తూ వారిని చైతన్య పరచాలన్నారు. బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలని ఆదేశించారు.

కార్యదర్శుల పనితీరుపై చంద్రబాబు అసంతృప్తి

అంతకు ముందు కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. క్యాబినెట్ భేటీ ప్రారంభమైనా, అజెండా తమకు రాలేదని సీఎం వద్ద మంత్రి మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని క్యాబినెట్‌కు వచ్చే వీలు ఉండేదని అన్నారు. దీనిపై స్పందించిన సీఎం కార్యదర్శుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు మరింత ఉపసయోగపడాల్సిందిపోయి రాను రానూ మరింత సంక్లిష్టంగా మారుతున్నాయని అధికారుల తీరును చంద్రబాబు తప్పుబట్టారు.

డీమ్డ్ యూనివర్సిటీలను ఎక్కువ ప్రొమోట్ చేయాలి

గతంలో కార్యదర్శులు సబ్జెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రొమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలకు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ, ఎక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని అన్నారు.

## పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు... కళింగిరి శాంతి ప్రస్థానం

**కాకినాడ :** దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరుపొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి.శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం.ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది.శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు లేదా ఏసీబీ దాడులు జరిగే వరకు వేచి చూడటం వ్యవస్థల బలహీనతను సూచిస్తుంది.

## హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం



**గుడుపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండల పరిధిలోని గుడుపల్లి సర్కిల్ వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. గ్రేస్ మేరియా సేవా విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో, పోలీసు శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫ్లాష్ మాబ్ ద్వారా ప్రజలకు రహదారి భద్రతపై సందేశాలు అందించారు. ఈ సందర్భంగా కుప్పం డీఎస్పీ పార్థసారథి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రాణ రక్షణలో హెల్మెట్ వినియోగం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాళ్లబుదుగూరు ఎస్సై నరేష్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు విధిస్తామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఆరోగ్య రాజ్, జేసు మేరీతో పాటు గంగరాజు గొల్లపల్లి ట్యూషన్ విద్యార్థులు పాల్గొని ఫ్లాష్ మాబ్ ద్వారా హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని చూసిన స్థానికులు పోలీసు శాఖ, ట్రస్టు చేపట్టిన ఈ ప్రయత్నాన్ని అభినందించారు.

**తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా**

## క్లస్టర్ ఇంచార్జ్ సత్కారం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 10:**
తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుప్పం నియోజకవర్గంలో పార్టీకి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్లస్టర్ ఇంచార్జ్ లను గుర్తించి సత్కరించారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గానికి చెందిన క్లస్టర్ 10 మున్సిపాలిటీ మొదటి స్థానం సాధించినందుకు కుప్పం పార్టీకార్యాలయంలో 10వ క్లస్టర్ ఇంచార్జ్ ఎస్ సోమశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు పి యస్ మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ పాల్గొని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మిట్టూరులో కమ్యూనిటీ క్లినిక్, ప్రసూతి ఆరోగ్య కేంద్రం ప్రారంభం



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోని మిట్టూరులో రాష్ట్ర ప్రభుత్వం, చిత్తూరు నగం పాలక సంస్థ మరియు వేలూరు సీఎంసీ క్యాంపస్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ క్లినిక్, ప్రసూతి ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కుప్పం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు పాల్గొన్నారు. వేలూరు సీఎంసీ క్యాంపస్ డైరెక్టర్ బిజూ జార్జ్, మెడికల్ సూపరింటెండెంట్ ఐ. రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగ భూషణ్ రెడ్డి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పద్మాంజలి దేవి, నగరపాలక సంస్థ కమిషనర్ పి. నరసింహ ప్రసాద్,మున్సిపల్ ఆరోగ్య అధికారి లోకేష్ తదితరులు హాజరయ్యారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ప్రాంతంలోని ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు, గర్భిణీ స్త్రీలకు ప్రసూతి సంబంధిత వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఈ కేంద్రం ఏర్పాటు చేయడంలోని ముఖ్య ఉద్దేశ మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## దాసేగౌనూరు లేఅవుట్‌పై గ్రామపంచాయతి హెచ్చరిక



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 10:**
కుప్పం నియోజకవర్గంలోని దాసేగౌనూరు గ్రామంలో అనుమతులు లేకుండా వేయబడిన లేఅవుట్‌పై గ్రామపంచాయతి హెచ్చరిక జారీ చేసింది. గ్రామానికి సంబంధించిన 490, 491, 462, 463, 464, 471 సర్వే నంబర్లలో ఉన్న వ్యవసాయ మరియు బంజరు భూములను నివాస స్థలాలుగా మార్చి, గ్రామపంచాయతి అనుమతి లేకుండా లేఅవుట్ వేయబడినట్లు గ్రామపంచాయతి అధికారులు తెలిపారు. అదేవిధంగా పట్టణాభివృద్ధి సంస్థ నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు కూడా తీసుకోకుండానే స్థలాలను విభజించి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ విధంగా లేఅవుట్ వేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆ లేఅవుట్‌లో ఎవరైనా స్థలాలు కొనుగోలు చేసినట్లయితే గ్రామపంచాయతి తరపున ఎటువంటి అనుమతులు, సౌకర్యాలు అందించబడవని వెల్లడించారు. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణానికి అవసరమైన బ్లూప్రింట్ అనుమతులు, తాగునీరు, విద్యుత్, రహదారులు, కాలువలు వంటి మౌలిక వసతులు కల్పించబడవని గ్రామపంచా యతి తీర్మానం చేసినట్లు తెలిపారు. కాబట్టి ప్రజలు పూర్తి వివరాలు తెలుసుకొని మాత్రమే స్థలాల కొనుగోలు చేయాలని గ్రామపంచాయతి హెచ్చరించింది.

## టిడిపి కార్యకర్త నరసింహారెడ్డి తండ్రి తాతిరెడ్డి రాజారెడ్డి మృతి



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 10:**
వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త తాతిరెడ్డి నరసిం హారెడ్డి తండ్రి తాతిరెడ్డి రాజారెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఆయన భౌతిక దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో వెదురుకుప్పం టిడిపి మండల అధ్య క్షుడు మోహన్ మురళి, బ్రాహ్మణపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు బోడిరెడ్డి కోదండరెడ్డి, మొండివెంగనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, వెదురుకుప్పం గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి గాంధీ తదితరులు ఉన్నారు.

**ఉపాధిహామీ పథకం పనులలో అవినీతి జరిగితే**

## కఠిన చర్యలు తప్పవు - ఎంపీడీవో ఏపీఆర్ కుమార్



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలంలోని చిన్నారిదొడ్డి గ్రామ పంచాయతీలోని చెంచప్ప చెరువు నందు జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ శుక్రవారం పరిశీలించారు. పాత పనులకే మళ్ళీ బిల్లులు చేస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై సంభందిత క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పనులకే మార్పులు చేసి మరళా బిల్లులు పెట్టాలని ప్రయత్నిస్తే సంభంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ ఏ పి ఆర్ కుమార్ తెలిపారు. సంభందిత క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులకు షోకాజు నోటీసులు జారీచేస్తామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజల జీవన మెరుగుదలకై నిర్దేశించిన ఈ ఉపాధిహామీ పథకములో లోపాలు జరిగితే కూలీలు నష్ట పోతారని కూలీలకు అవగాహన కల్పించారు. మండలములో ఎక్కడైనా ఉపాధిహామీ పనులు కల్పించకపోయిన, పనులలో లోపాలు వున్న వెంటనే నాకు తెలుపాలని ఎంపీడీఓ తెలిపారు.

## గ్రామ సర్వేయర్ల రక్తదానం ప్రశంసనీయం

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 10:**
జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా చిత్తూరు రెవెన్యూ భవనంలో గ్రామ సచివాలయ సర్వేయర్లు నిర్వహించిన రక్తదాన శిబిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్త నిల్వల కొరతను దృష్టిలో ఉంచుకుని రోగుల ప్రాణాలను కాపాడేందుకు ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే భావనతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలు రక్షించబడతాయని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వే ఉద్యోగులు మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పంలో ఉచిత మెగా కంటి శస్త్ర చికిత్స శిబిరం ప్రారంభం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
ప్రపంచ ప్రఖ్యాత శంకర నేత్రాలయ కంటి ఆసుపత్రి, మెదలైటిక్ యు ఎస్ ఎ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో, చిత్తూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో కుప్పంలో ఉచిత మెగా కంటి పరీక్షా, శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించబడుతోందని సాయి మాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వైద్య శిబిరం ఈనెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు వారం రోజులపాటు కుప్పం ఎంఎఫ్‌సి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో కంటికి సంబం ధించిన అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించ నున్నట్టు తెలిపారు. అదేవిధంగా అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసి లెన్స్ అమర్చే సేవలను కూడా పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. అత్యాధునిక పరికరాలతో సురక్షితమైన మొబైల్ ఆపరేషన్ థియేటర్ వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు శస్త్రచికిత్సలు అందుబాటులోనికి తీసుకురావడం ఈ శిబిరం ప్రత్యేక సదా తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం కేవలం రెండు గంటలలోనే రోగులు తమ ఇళ్లకు వెళ్లే వీలుండటం మరింత సౌలభ్యాన్ని కల్పిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద ప్రజలకు నాణ్యమైన కంటి వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటికి సంబంధించిన సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉచిత చికిత్సలు, శస్త్రచికిత్సలు పొందాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్: 9391833999 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

**ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యాసంస్థల**

## విద్యార్థులుకు ప్రతిభా పురస్కారాలు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 10:**
అన్నమయ్యజిల్లా పీలేరు ఇంటర్నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలింపియాడ్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులకునియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ.. విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తూ క్రీడలు, నైపుణ్యం, క్రమశిక్షణ సమయపాలన పాటించాలని పట్టణం, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసిస్తే జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని ఈ విజయాలే అందుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్,ఆర్ ఐ శ్రీధర్, కోఆర్డినేటర్ రవికుమార్ ప్రిన్సిపల్ సుమన్ గౌడ్, ప్రతాపరెడ్డి, డిన్ జానకిరామ్, ప్రైమరీ ఇన్చార్జీలు అనూష సునంద, పీలేరు షీ విద్యాలయ నిర్వహకులు డాక్టర్ పి వి ఎస్ లక్ష్మి డాక్టర్ రాయల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చదవండి.. చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

## సంపాదకీయం

# ఏకధ్రువ ప్రపంచానికి చెక్ పెట్టినట్లేనా!

ప్రతిమనిషి పుట్టుకతోనే జీవించే హక్కుతో భూమిమీదకు వస్తాడు. మరణం అనేది ఆ హక్కుకు దూరం కావడమే! సాధారణ మరణం సహజ ప్రక్రియ. యుద్ధ మరణం అనేది ఉన్మాద చర్యతో జీవించే హక్కును అర్థాంతరంగా తుంచివేయడం. అందుకే ఏరకమైన యుద్ధమైనా వినాశ హేతువే? యుద్ధం ఒక పీడకచర్య. యుద్ధ మరణాలకు హేతుబద్ధత ఉండదు. మధ్యయుగాలలో యుద్ధమంటే వీరత్వానికి ప్రతీక. అటు తర్వాత ఆయుధం ప్రధానపాత్ర వహించింది. అధికారానికి ఆయుధం ప్రాకారంగా నిలిచింది. సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ దశలో ఆయుధానిదే పైచేయి అయింది. ఇప్పుడు యుద్ధ వ్యూహాల్లో మార్పులొచ్చాయి. ఒకప్పుడు రష్యా, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధస్థితి నుంచి, రష్యా అంతర్గత రాజకీయ మార్పుల తర్వాత అమెరికా ఏకధృవ ప్రపంచంగా ఎదిగింది. అంతేకాదు, తమ భూభాగంలో కాకుండా ప్రపంచం మొత్తం యుద్ధ స్థావరాలు ఏర్పరచుకొని, సైన్యాన్ని మోహరించి ప్రపంచ పోలీసుగా పెత్తనం చేస్తోంది. జనరల్ గడాఫీ, అలెండీ, సద్దాం హుస్సేన్ లాంటి ఎందరో దేశాధినేతలను హత్య చేయడంతో పాటు, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో అనేక దేశాలతో యుద్ధాలు చేసింది. చివరకు తమ వ్యాపార సామ్రాజ్యానికి పోటీరాకుండా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు వేసి సాముహిక మానవహననానికి అమెరికా పాల్పడింది. వియత్నాంతో పదహారేళ్ల సుదీర్ఘ యుద్ధం తర్వాత అమెరికా దూకుడుకు కళ్లెం పడింది. ఇప్పుడు ఇరాన్‌తో భూతల యుద్ధంతో తలపడడం అంటే చావునోట్లో తలపెట్టడమేనన్న వ్యవహారం అర్థమైన తర్వాత ఇంటా, బయట ఏకాకిగా మారిన ట్రంప్, వ్యూహం మార్చి ఇరాన్‌తో సీజ్ ఫైర్‌కు తాపత్రయ పడ్డాడు. వ్యూహాత్మకంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇరాన్ కూడా పది షరతులతో సిద్ధమైంది. సీజ్‌ఫైర్ అనబడే ఒప్పందం అనేది ఇటీవల కాలంలో ముందుకొచ్చిన దౌత్య ప్రక్రియనే. ఒకప్పుడు గ్రూపుల మధ్య ఒప్పందం ఇప్పుడు దేశాల మధ్యకు మారింది. భారత్–పాకిస్తాన్, ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధాలలో ట్రంప్ ముందుకు తెచ్చిన ప్రక్రియనే ఇది. కొత్తదేం కాదు, కాకుంటే ఓటమి అంచుల్లో పరువు దక్కించుకునే ఏకైక సూచిక! ట్రంప్ రెండువారాల యుద్ధ వెసులుబాటుకు ప్రయత్నమే ఆయనలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనం. ఇరాన్‌లో 240మంది మహిళలు, 212 మంది పిల్లలు వెరసి 2076 మంది ప్రజలు యుద్ధంలో మరణించారు, 26,500 ప్రజలు గాయపడ్డారు. మిత్రదేశం లెబనాన్‌లో మరో 13వందల మంది ప్రజలను ఇజ్రాయిల్ చంపేసింది. అంతేకాదు, యుద్ధ ప్రారంభంలోనే ఇజ్రాయిల్, అమెరికా కుట్రపూరితంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయుతుల్లా ఖొమైనీని అంతం చేసింది. అయినా ఇరాన్ తమ మౌలిక వనరుల రక్షణ దృష్టితో సీజ్‌ఫైర్‌కు అంగీకరించింది. సుదీర్ఘ కాలం తమవెంట ఉన్న పశ్చిమ యూరప్ దేశాల యుద్ధ కూటమి "నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్' నాటోలోని 30 దేశాలు ఇరాన్‌పై ట్రంప్ దాడికి మద్దతివ్వలేదు. సరికదా కొన్ని దేశాలు నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. ఇక ప్రపంచ దేశాల ప్రజలతో పాటు, తనదేశంలో ప్రజలు నిరసన పతాకస్థాయికి చేరడంతో ట్రంప్ ఓ అడుగు సీజ్‌ఫైర్ పేరుతో వెనక్కి తగ్గాడు తప్ప, తనలోని యుద్ధ పిపాసి ఇంకా చావలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చోడి చేతిలో రాయిలా ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల పేరుతో విరుచుకుపడ్డాడు. గాజా విషయంలో ఇజ్రాయిల్ అమానుష కాండకు పరోక్షంగా మద్దతిచ్చాడు. పనామా అధ్యక్షుడు నోరిగోను మాదకద్రవ్యాల పేరుతో జైలు శిక్ష వేసి నిర్భందించాడు."ఆపరేషన్ అబ్జార్వేట్ రిజర్వ్" పేరుతో ప్రజలచేత ఎన్నికైన వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలను అర్ధరాత్రి ఇంటినుంచి కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్బంధించాడు.కేవలం ఆయిల్‌పై నియంత్రణ కోసం ఒకదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేయడమే కాక, తన పదవీ కాలం ముగిసిన తర్వాత వెనెజులాలో ఎన్నికలని కుళ్లు జోకులు వేస్తున్నాడు. పక్క రాష్ట్రం మెక్సికోతో ఘర్షణ, చిన్నదీవి లాంటి దేశం క్యూబాపై మానవత్వం మరచి ఆంక్షలు పెట్టడంతో పాటు, ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబా అంతు చూస్తానంటున్నాడు. మరోవైపు పక్క దేశం కెనడాను తమదేశంలో అంతర్భాగం రాష్ట్రంగా కలుపుకుంటామని అవాకులు చవాకులు పలుకుతున్నాడు. నాటోలో అంతర్భాగమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి నాటో కూటమి దేశాల్లో తమ పరపతి కోల్పోయాడు. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ విమానాశ్రయం కావాలని పట్టుబడుతున్నాడు. ఇవన్నీ ట్రంప్ ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకుండా వేస్తున్న చిల్లర వేషాలు తప్ప మరొకటి కాదు. మరో ముఖ్యమైన విషయం. ఎప్‌స్టీన్ ఫైల్స్ నుండి బయటపడడం కోసం, అత్యంత పెద్దదైన ఆసియా ఖండంలో పట్టుకోసం మరో యుద్ధోన్మాద దేశం ఇజ్రాయిల్‌తో కలిసి కుట్రపన్నాడు! ఇరాన్‌ను ఓడిస్తే తనకు ప్రపంచంలో తిరుగుండదని, యుద్ధ ప్రారంభంలోనే ఖొమైనీ లాంటి ఆయువుపట్టును లేపేస్తే, తాను వెనెజులా దేశంలా ఇరాన్‌ను కబళించి ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. నలభై రోజులుగా యుద్ధంలో ఇరాన్ అటు ఇజ్రాయిల్‌తో పోరాడుతూనే, అమెరికా అవకాశ ఆధిపత్యాన్ని వ్యూహాన్ని సవాల్ చేసి నిలబడింది. ఇరానియన్ రిపబ్లిక్ గార్డుల ధైర్య సాహసాలముందు అమెరికా తలవంచక తప్పలేదు. అగ్రరాజ్య ఆధునిక యుద్ధ విమానాలను కూల్చివేయడంతో ట్రంప్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. అంతర్గత సంక్షోభం, అధికార మార్పిడి లాంటి మాటలు ఇరాన్‌లో తుత్తునీయలు కావడం, ప్రపంచ పాలక వర్గాలు ఎలావున్నా ప్రజలు మద్దతు ఇరాన్‌కు అను కూలంగా ఉండడం, ఇరాన్ కూడా భౌగోళిక యుద్ధ తంత్రం హార్మూజ్ జలసంధి మూసివేత, గల్ఫ్‌లో ఉన్న సౌదీ అరేబియా తదితర దేశాల్లో అమెరికా సైనిక శిబిరాలు, ఆయా దేశాల సాంకేతిక, ఆర్థిక వనరులపై వ్యూహాత్మకంగా దాడులు జరపడం ద్వారా అమెరికాకు వణుకు పుట్టించిందని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ కోసం అమెరికా ఇరాన్‌పై దండయాత్రకు దిగింది. తమకు అమెరికా ప్రజలతో ఎలాంటి శత్రుత్వం లేదని ఇరాన్ ప్రకటించడం ఆ దేశ కుయుక్తిని ఎండగట్టింది. అమెరికా ఇరాన్ యుద్ధంలో ఒంటరై ఏకధృవ ప్రపంచం ఏవగింపునకు గురైంది. ఈ దశలో సీజ్‌ఫైర్ రెండు వారాల తర్వాత శాశ్వత ఒప్పందం జరుగుతుందా? యూటర్న్ తీసుకుంటుందా? ఈ విషయం నిర్ధారించే పరిస్థితి లేదు. ఎందుకంటే ఒప్పందం జరిగింది అమెరికా–ఇరాన్ మధ్య కనుక తాము యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయిల్ తన యుద్ధ దాహం తీరక లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. అందుకు ప్రతిగా ఇరాన్ సైతం గల్ఫ్‌లో ఇజ్రాయిల్, అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తోంది. అమెరికా–ఇరాన్ యుద్ధం ద్వారా రష్యా ఒకింత ఆయిల్ వ్యాపార రిత్యా, ఉక్రెయిన్ వైపు అమెరికా ఆయుధ సంపత్తి అందకుండా చేయడంలో సఫలమైంది. చైనా, ఉత్తరకొరియా, రష్యా దేశాలు ఇరాన్‌కు అందించిన సాంకేతిక, ఆయుధ మద్దతు ఆ దేశం నిలబడడానికి చాలా తోడ్పాటునందించింది. హార్మూజ్ జలసంధి విషయంలో చైనా, రష్యా, ఫ్రాన్స్ ఐక్యరాజ్యసమితిలో తమ వీటో అధికారంతో ఇరాన్‌కు మద్దతు పలకడం అమెరికా ఏకఛత్రాధిపత్యానికి ఒక రకంగా చెక్ పెట్టినట్లే!

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143